## హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోహీర్, ఫిబ్రవరి 5: మండలంలోని రాజనెల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఎంపీ బీబీ పాటిల్ కేటాయించిన నిధులతో గ్రామానికి రెండు హైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. ఇందులోభాగంగా చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలను ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచ్‌లు లచ్చమ్మ, రాజశేఖర్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి,మ్యాథరి ఆనంద్, ఈశ్వరప్ప, గోవర్ధన్ రెడ్డి, ఆనంద్, లక్ష్మణ్ ఉన్నారు.



దర్గాలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

## 'మన ఊరు-మనబడి'పై ఆరా

కొండాపూర్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ఎలా ఉందనే కోణంలో సోమవారం రాష్ట్ర అదనపు సంచాలకుడు రమేశ్ కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మన ఊరు-మనబడి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఉన్నత పాఠశాలల్లో పంపిణీ చేసిన డిజిటల్ తరగతి గదులను కూడా పరిశీలించారు. (ఐఎఫ్‌పీ) ప్యానల్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. జిల్లాకు పంపిణీ అయిన లైబ్రరీ పుస్తకాల సరఫరాను కలెక్టరేట్‌లో పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి తరగతుల నిర్వహనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, సీఎంవో వెంకటేశం, ఏఎంవో పాల్గొన్నారు.



విద్యార్థులను పరిశీలిస్తున్న రాష్ట్ర అదనపు సంచాలకుడు రమేశ్

## ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు జరగాలి

కోహీర్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలను చేయించాలని మండల వైద్యాధికారి నవీన్‌కుమార్ ఆదేశించారు. సోమవారం మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన ఆశ వర్కర్లకు చేపట్టిన ఐదు రోజుల శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు అయిన నుంచి ప్రసవాలు చేయించే వరకు ఆశ వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. వారిని ఇంటికి పంపించేందుకు అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని గుర్తు చేశారు. బాలింతలకు కూడా ఇలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## 'సగరుల' సమస్యల పరిష్కారానికి కృషి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 5: సగరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలంగాణ సగర యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తుక్కన్న అన్నారు. సోమవారం మండలంలోని ఖలీల్‌పూర్ గ్రామంలో మండల సగర సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగరుల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పథకాలను సగరులకు లబ్ధిచేకూర్చి అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. అనంతరం సగర సంఘం జిల్లా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశం లో జిల్లా యువజన సగర సంఘం జిల్లా ప్రధాన జనార్దన్, సంఘం నాయకులు విజయ్‌కుమార్, అశోక్, నర్సింహులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

సదాశివపేట, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని వెంకటాపూర్, నిజాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మైథా ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో అంజయ్య మాట్లాడుతూ వెంకటాపూర్ పాఠశాలలో 52మంది, నిజాంపూర్ పాఠశాలలో 84మంది విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారని తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రుద్రప్ప, సురేశ్, మైథా కమ్యూనిటీ అధికారి శ్రీశైలం, సీఆర్పీలు రాజేశ్వర్, నగేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెంకటాపూర్ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసిన దృశ్యం

## బస్సు ఢీ : ఇంటర్ విద్యార్థి మృతి

జహీరాబాద్, ఫిబ్రవరి 5: జహీరాబాద్ పట్టణంలోని డాక్టర్ ఆర్ఎల్ఆర్ పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శ్రీకాంత్(17) మృతిచెందినట్లు పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని రాంనగర్‌కు చెందిన శ్రీనివాస్ కుమారుడు టీవీఎస్ ఎక్సెల్‌పై డాక్టర్ ఆర్ఎల్ఆర్ పాఠశాల వద్ద రోడ్డు మలుపుతుండగా జహీరాబాద్ నుంచి న్యాల్‌కల్ వయా హైదరాబాద్ వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. డ్రైవర్ అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు చెప్పారు. రాంనగర్‌కు చెందిన శ్రీనివాస్, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఆదివారం సాయంత్రం ముంబైకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్, లక్ష్మి ఉపాధి కోసం ముంబైకి వెళ్లి పనులు చేసుకుంటారన్నారు. సోమవారం జహీరాబాద్ సర్కార్ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడి తల్లి ముంబై నుంచి మంగవారం రాగానే అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. బస్సు డ్రైవరును అదపులోకి తీసుకున్నారు. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

సదాశివపేట, ఫిబ్రవరి 5: పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ నెల 16న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐకేపీ, వీవోఏ యూనియన్ నాయకులు ఏపీఎం నర్సింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ, వీవోఏ యూనియన్ నాయకులు నాగరాజ్, ఆంజనేయులు, మోహిజ్, యాదయ్య, సత్యమ్మ, మంగ, జ్యోతి పాల్గొన్నారు.

# నిధుల కేటాయింపుపై రగడ

- బొల్లారం మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు
- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- రూ.6.40 కోట్లతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి నినాదాలు చేస్తున్న కౌన్సిలర్లు

బొల్లారం, ఫిబ్రవరి 5: నిధుల కేటాయింపులు, అభివృద్ధి పనుల్లో వివక్ష చూపుతున్నారంటూ బొల్లారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లతో పాటు వైస్ చైర్మన్ సమావేశాన్ని బహిష్కరించారు. సోమవారం బొల్లారం మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ చంద్రారెడ్డి అభివృద్ధి పనుల ఎజెండాను విసిరేసి నిరసన గళాన్ని వినిపించారు. నాలుగేండ్లుగా అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కేటాయింపులో చైర్‌పర్సన్, కమిషనర్లు వివక్ష చూపుతున్నారని ఆక్షేపించారు. వారి తీరుకు నిరసనగా కౌన్సిలర్లు చంద్రారెడ్డి, నిహారిక, గోపాలమ్మ, జయమ్మ, సంధ్య, సంతోషి సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం ఎదుట బైఠాయించి కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాలుగేండ్లుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనుల కోసం నిధులు ఇవ్వాలన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రూ. 6.40కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వార్డుల అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఉంటుందని, కొందరు సభ్యులు కావాలనే సభలో గందరగోళం సృష్టించారని ఆరోపించారు. కాగా కౌన్సిలర్ చంద్రారెడ్డి వర్గీయులు సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలపడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్వో శ్రీధర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరుకు రైతులకు లబ్ధి చేకూరుస్తాం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 5: చెరుకు రైతులకు కార్మాగారం అన్నివిధాలుగా లబ్ధిచేకూర్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నదని గోదావరి ఆగ్రో ప్రొడక్షన్ చక్కర కార్మాగార డైరెక్టర్ మహేశ్ బండారి అన్నారు. సోమవారం మండలంలోని హద్నూర్ గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది తమ కార్మాగారంలో రోజుకు 2,500 మెట్రిక్ టన్నుల మేరకు క్రషింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. క్రషింగ్‌కు చెరుకును తరలించేందుకు కూలీలు, రవాణా చార్జీలను సమకూర్చుతామని పేర్కొన్నారు. అనంతరం కార్మాగార కేన్ మేనేజర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా చెరుకు ప్లాంటేషన్ చేసే రైతులకు రూ.7వేల రుణాన్ని, రైతులకు అవసరమైన కొత్త వంగడాల చెరుకు మొక్కలను సరఫరా చేస్తామన్నారు. సమావేశంలో గోదావరి ఆగ్రో ప్రొడక్షన్ చక్కెర ఫ్యాక్టరీ డైరెక్టర్ వెంకటేశ్ గోయల్, ఫీల్డ్ ఆఫీసర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ఫీల్డ్‌మేనేజర్ సంగమేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

## భూనిర్వాసితులతో అధికారుల సమావేశం

హత్నూర, ఫిబ్రవరి 5: ట్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులతో రెవెన్యూ అధికారులు సోమవారం సమావేశమయ్యారు. హత్నూర మండలం కాసాల శివారులోనుంచి ట్రిబుల్ ఆర్ వెళ్తుండడంతో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం ఏర్పాటుచేసి రైతులు సాగుచేస్తున్న పంట వివరాలు సేకరించారు. బోరుబావులు, చెట్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇతర స్థిరాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య, ఆర్ఐ పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆటల పోటీలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 5: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు పాల్గొనేందుకు ఎంచుకోవాల్సిన అంశాలను వివరించారు. సుస్థిర భవిష్యత్‌కు సైన్స్ అనే అంశంలో ఉప అంశాలను విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చున్నారు. చెత్తను తొలిగించడం, ఈ వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లు, సుస్థిరమైన ఆహార వ్యవస్థలను దత్తత తీసుకోవడం, యూస్ అండ్ త్రో ప్లాస్టిక్‌కు నో చెప్పడం, నీటిని పొదుపు చేయడం, శక్తిని కాపాడడం వంటి ఉప అంశాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 6న ప్రతిపాఠశాలలో పోటీలు నిర్వహించి, ఒక్కో విభాగంలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని మండల స్థాయికి పంపిస్తామన్నారు. 7న మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ నెల 9న ఉదయం 10గంటలకు జిల్లా సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ఒక్కో పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన మొత్తం 12 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అక్కడ ఎంపికైన వారికి ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా రవీంద్ర భారతిలో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

హత్నూర, ఫిబ్రవరి 5: భూఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన సురేందర్‌గౌడ్ సోమవారం కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాసాల శివారులోని సర్వే నంబర్ 336 లోని 2ఎకరాల 20గుంటల భూమిలో 40 ఏండ్లుగా బోరువేసి పంట సాగుచేసుకుంటున్నట్లు తెలిపారు. 7 ఏడేండ్ల క్రితం అనారోగ్యానికి గురై భూమి సాగుచేయకపోవడంతో బీడుగా మారడంతో అదునుచూసిన గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు భూమిని ఆక్రమించుకున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి తనభూమిని, ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

## పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం

జిన్నారం, ఫిబ్రవరి 5: జిన్నారం మండలం జంగంపేట గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను సర్పంచ్ జోగు వెంకటయ్య ఘనంగా సన్మానించారు. సోమవారం పంచాయతీ ఆవరణలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సర్పంచ్ ఆధ్వర్యంలో పదవీ కాలం పూర్తి చేసుకున్న పాలకవర్గ సభ్యుల సేవలను కొనియాడుతూ సన్మానించారు. గ్రామ ప్రజలు అందించిన సహకారానికి పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అందించిన సహకారం మరువలేనిదని సర్పంచ్ కొనియాడారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు నర్సారెడ్డి, మంజులాదుర్గేశ్ యాదవ్, దీపామల్లారెడ్డి, స్వాతీశేఖర్, లావణ్యానర్సింహులు, కో-ఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, నీటి సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ, సిబ్బంది పాల్గొన్నారు.



జంగంపేటలో పంచాయతీ పాలకవర్గ సభ్యులను సన్మానిసున్న సర్పంచ్ వెంకటయ్య



## యూజీడీ పనుల పరిశీలన

రామచంద్రాపురం, ఫిబ్రవరి 5: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 13వ బ్లాక్‌లో జరుగుతున్న అంతర్గత డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సోమవారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ పరిశీలించారు. డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించకూడదని ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను త్వరగా పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జలమండలి మేనేజర్ జనార్దన్‌కు సూచించారు. యూజీడీ పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు వేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాగులుగౌడ్, అశ్విని, బిందు, మల్లేశ్, మహిపాల్, అలీబాబా, మహేశ్, నర్సింహ పాల్గొన్నారు.

# క్రీడలకు వయస్సుతో పనిలేదు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 5: క్రీడలకు వయస్సుతో పని లేదని, క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. టీనా ఆధ్వర్యంలో గేటెడ్ కమ్యూనిటీస్‌కి వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. వివిధ కమ్యూనిటీస్‌కి సంబంధించి మొత్తం 700మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెల్లాపూర్‌లోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో టీనా ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కార్నివల్ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకలో ప్రభుత్వ పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. స్పోర్ట్స్ కార్నివల్‌కు వచ్చే సందర్శకుల కోసం పలు ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. క్రీడల్లో విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీస్‌లో నివాసం ఉండేవారందరిని ఏకం చేసేందుకు స్పోర్ట్స్ కార్నివల్‌ని నిర్వహించామన్నరు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ క్రీడల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. గేటెడ్ కమ్యూనిటీస్ వాసులందరూ కలిసి ఈవెంట్‌ను గ్రాండ్ సక్సెస్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో టీనా సభ్యులు దీప్తి, కవిత, రవి, రామ్‌కుమార్, మేరు స్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ

# పాత పంటల సంరక్షణే లక్ష్యం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 5: కనుమరుగవుతున్న పాత పంటలను రక్షించి భావితరాలకు అందించడమే కాకుండాజీవ వైవిధ్యాన్ని కాపాడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళా సంఘాల లీగల్ కోఆర్డినేటర్ చక్కమ్మ, జాతర కమిటీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గుంజోట్టి, హుస్సెల్లి గ్రామాల్లో పాతపంటల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ పాతపంటలైన తైదలు, కొర్రలు, సాములు, రాగులు, అవిసలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటలతో అనేక ప్రయోజనాలుంటాయన్నారు. కాలానుగుణంగా మారుతున్న ఆహారపు అలవాట్లతో ప్రస్తుతం అంతా ఆరోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు పాతపంటలను కాపాడుతూ, సాగు చేసేందుకు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా పాతపంటల విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపును నిర్వహించారు. డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, మహిళలు చేపట్టిన కోలాటం, చిటికెల రామాయణం, ఆటపాటలు ప్రజలకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చంద్రప్ప, గుంజోట్టి గ్రామ మాజీ సర్పంచ్ చెన్నమ్మ, డీడీఎస్ సిబ్బంది నర్సమ్మ, మంజూల, నర్సమ్మ, కమలమ్మ, విజయలక్ష్మి, నాగమ్మ, సురేశ్, పూలమ్మ, మహిళా సంఘం రైతులు పాల్గొన్నారు.



హుస్సేల్లిలో పాత పంటల విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపు

# టమాట సాగుపై అవగాహన



టమాట సాగుపై సూచనలు చేస్తున్న ఉద్యాన కళాశాల విద్యార్థులు

జహీరాబాద్, ఫిబ్రవరి 5 : టమాట పంటకు సోకే ఆకుమాడు, ఆకు మడత, మచ్చ తెగులు, తెల్ల దోమ సూది పురుగు కాయతొలుచు, ఆకు తొలుచు పురుగులతో కలిగే నష్టాలపై రైతులు అప్రమత్తంగా ఉండలని జహీరాబాద్ ఏఈవో ప్రదీప్‌కుమార్ సూచించారు. సోమవారం జహీరాబాద్ మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామంలో రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల విద్యార్థులకు టమాట సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు శిక్షణలో భాగంగా ఇన్ఫర్మేషన్ కార్నర్ ఏర్పాటు చేసి పోస్టర్ రూపంలో రైతులకు అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు మూడు నెలలపాటు వారికి ఎంపిక చేసిన రైతుల పొలాల వద్దకు వెళ్లి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు శివాని, సోమ్య, సంతోషి నీరెడ్డి, శ్రీజారావు, రక్షిత, వైష్టవి, శ్రీనిధి, సుప్రి య, ఉషాశ్రీ, సాహితి, సంధ్య, శివన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, మొల్లప్ప పాల్గొన్నారు.

## దైవభక్తితోనే ముక్తి

కంగ్టి, ఫిబ్రవరి 5: భక్తితోనే మనిషికి ముక్తి లభిస్తుందని ఝరాసంఘం మండలం మల్లయ్యగిరి ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ బసవలింగ అవధూతగిరి మహారాజ్ అన్నారు. ఆదివారం రాత్రి కంగ్టి మండలంలోని తడ్కల్‌లో పాండురంగ ఆలయ 3వ వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు బానిసలై ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారన్నారు. ఆధ్యాత్మికత శక్తి మాత్రమే వీటిని మాన్పించగలదన్నారు. రోజూ గంటపాటు దైవచింతనతోపాటు సత్సంగ్ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంతకు ముందు మహిళలు కలశాలతో మహారాజ్‌కు స్వాగతం పలికారు.



ప్రవచనలు చెబుతున్న మల్లయ్యగిరి ఆశ్రమపీఠాధీపతి డాక్టర్ బసవ లింగ అవధూతగిరి మహారాజ్

## ఎంపీగా అవకాశం కల్పించాలి

సంగారెడ్డి, ఫిబ్రవరి 5 : మెదక్ ఎంపీగా అవకాశం ఇవ్వాలని బీసీ వర్గానికి చెందిన బీరయ్య యాదవ్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసి ఆశీస్సు లు పొందారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ను కలిసి తనకు మెదక్ లోక్‌సభ టికెట్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ తన ఆశీస్సులు ఉంటాయని పార్టీ అధినేత ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించడమే తమ ముందున్న కర్తవ్యమని చెప్పారు. పార్లమెంటు టికెట్ బీరయ్యకే కేటాయిస్తే గెలుపునకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.



ఎమ్మెల్యే చింతాప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీరయ్య యాదవ్

## కురుమలు రాజకీయంగా ఎదగాలి

కంగ్టి, ఫిబ్రవరి 5: కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి ఆకాంక్షించారు. సోమవారం కంగ్టి మండలంలోని బాబుల్‌గామ గ్రామంలో బీరప్ప ఆలయంలో నిర్వహించిన కల్యాణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కురుమలు అధికంగా ఉన్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గోవింద్‌యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఓంప్రకాశ్, బీరుగొండ, నర్సింహులు, ఎంపీటీసీ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాపుమల్‌శెట్టి

## మహాసభలను విజయవంతం చేయాలి

అందోల్, ఫిబ్రవరి 5: ఖమ్మంలో ఈనెల 11, 12తేదీల్లో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్‌పటేల్ అన్నారు. సోమవారం జోగిపేటలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను మహాసభల్లో చర్చిస్తామన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు పాటుపడతామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కేవలం టీపీటీఎఫ్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

## కనీస వసతులు కల్పించాలి

పుల్కల్, ఫిబ్రవరి 5: కనీస మౌలిక వసతులు కల్పించాలని సోమవారం మండల పరిధిలోని బస్వాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. మౌలిక వసతులైన తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. పదేండ్ల క్రితం బాలికల కోసం నిర్మించిన వసతి గృహాన్ని ప్రారంభించాలని కోరారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్న సమయానికి బస్సులు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. సమస్యలు పరిష్కరించపోతే ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిభాను తక్షణమే సస్పెండ్ చేయాలంటూ ఏబీవీపీ నాయకులు సుభాష్‌చందర్, దత్తు, వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పదిహేను రోజుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లారు.